క్లుప్తంగా

ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక


చాకిరి సురేష్, జిల్లా కన్వీనర్


తొర్లపాటి రాజు, జిల్లా కో-కన్వీనర్

జంగారెడ్డిగూడెం : ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా నూతన కమిటీని ఈనెల 5న స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కన్వీనర్‌గా చాకిరి సురేష్ (జంగారెడ్డిగూడెం), కో-కన్వీనర్‌గా తొర్లపాటి రాజు (చింతలపూడి), సభ్యులుగా కురసం స్వాతి (వేలేరుపాడు), బంధం నాగేశ్వరరావు (వేలేరుపాడు), కురెళ్ళ ప్రసాద్ (ఏలూరు), వడ్డే రామరావు (రేచర్ల), వడ్ల మానాటి శ్రీనివాస్ (జంగారెడ్డిగూడెం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు అభినందించారు.

సచివాలయ కన్వీనర్ల సమావేశం

కొయ్యలగూడెం : మండల సచివాలయ కన్వీనర్లతో జగనన్న మండల సచివాలయ కన్వీనర్ల కో-ఆర్డినేటర్ నూకల రాము బుధవారం సమావేశం నిర్వహించారు. పరింపూడి సచివాలయం-1 కార్యాలయం వద్ద 50 మందికి పైగా సచివాలయ కన్వీనర్లు హాజరు కాగా, పార్టీ ఆదేశాల ప్రకారం వారికి దిశా నిర్దేశం చేశారు. జగనన్నే మా భవిష్యత్తు అట్టడుగువర్గాల ప్రజల్లోకి సైతం వెళ్లగలిగిందని, దానిని సద్వినియోగం చేయడంలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సఫలం అయ్యారన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి వలంటీర్ తమ కుటుంబానికి చెందిన మరొక వ్యక్తిని తన పరిధిలో గల కుటుంబాల వారికి పరిచయం చేయాలని సూచించారు.

ఓటరు జాబితాల్లో మార్పులు చేర్పులు పూర్తి చేయాలి


బూత్ లెవెల్ అధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మి

ద్వారకాతిరుమల : ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ బి.దుర్గా మహాలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం బూత్ లెవెల్ అధికారులకు స్పెషల్ సమ్మరి రివిజన్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో పాల్గొన్న డీటీ దుర్గా మహాలక్ష్మి మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, అలాగే మృతి చెందిన వారి ఓట్లు, గ్రామాన్ని విడిచి వెళ్లిపోయిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియ ఈనెల 1 నుంచి ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది జనవరి 5న ముగుస్తుందని తెలిపారు. ఆ తరువాత తుది ఓటరు జాబితా విడుదల అవుతుందన్నారు. కావున బూత్ లెవెల్ అధికారులు ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

శ్రమతోనే విజయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల విజయానికి శ్రమ ఒక్కటే తొలిమెట్టని నేషనల్ కెరీర్ కౌన్సిలర్ ప్రవీణ్ కృష్ణ పేర్కొన్నారు. భారతదేశ జీ-20 ప్రెసిడెన్సీలో భాగంగా జన్ భాగిధరి కార్యక్రమాల్లో బుధవారం స్థానిక ఏలూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యార్థులు తమలోని నైపుణ్యాలను పెంచుకుంటూ ఉన్నత లక్ష్యాల వైపు దృష్టి పెడితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రవీణ్ కృష్ణ పేర్కొన్నారు. పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి పి.రజిత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారులు ఎం.సత్తిబాబు, జి.ప్రేమజ్యోతి, విద్యార్థులు, పీఎంకేవీవై 4.0 షార్ట్‌టర్మ్ కోర్సు శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంపై వినతి

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వంగపండు వెంకట సత్యనారాయణను బదిలీ చేస్తూ గత నెల 31న ఈఎన్సీ (పీహెచ్) గుంటూరు వారు ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఏలూరు కమిషనర్ రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వకపోడంపై ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు బుధవారం ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ బాపిరాజుకు వినతి పత్రం అందజేశారు. తక్షణమే ఆయన్ని రిలీవింగ్ చేయాలని కోరారు. వెంకట సత్యనారాయణ తన స్థానిక, ఆర్థిక బలంతో రిలీవింగ్ కాకుండా ఏలూరులోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నట్టు యూనియన్ దృష్టికొచ్చిందని యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, ఎ.అప్పలరాజు తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండటమే కాకుండా ఏలూరు నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే క్రింది స్థాయి సిబ్బంది పట్ల అసభ్యకరంగా దురుసుగా పనిచేస్తున్న వంగపండుపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అనేక పర్యాయాలు వినతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, ధనాల అప్పారావు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- దుద్దుకూరులో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


దుద్దుకూరులో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : రైతుల వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో రైతుల కష్టాలను కళ్లారా చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ పంటల పనులకు ముందే రైతు భరోసా పథకంలో రైతులకు పెట్టుబడి సహాయాన్ని వారి బ్యాంక్ ఖాతాలో నేరుగా వేస్తున్నారని అన్నారు. ఈ ఏడాది కూడా రైతు భరోసా పథకంలో సొమ్ములను జమ చేశారని చెప్పారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు, జనుము, తదితర విత్తనాలను 90 శాతం సబ్సిడీపై గిరిజన రైతులకు అందజేసే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది అనేక మంది రైతులకు యంత్ర సహాయం కింద పనిముట్లతో పాటు ట్రాక్టర్‌లను కూడా వ్యవసాయ పనులకు వినియోగించుకునే విధంగా రైతులకు అందజేశారని చెప్పారు. ఇటీవల వచ్చిన వర్షాలకు పాడైన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవడం జరిగిందని అన్నారు. పేద రైతుల భూముల్లో జలకళ పథకం ద్వారా బోర్లు వేయడంతోపాటు విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారని చెప్పారు. రైతుల అభివృద్ధి ద్వారానే వారి కుటుంబాల్లో ఆనందం చూడాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం


నూతన మహిళా సమాఖ్య సభ్యులు

కొయ్యలగూడెం : మహిళా స్వయం సహాయక సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని మండల సమాఖ్య భవనంలో ఏపీఎం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలు అంగిన చిన్నాయమ్మ ఆధ్వర్యంలో గ్రామ సంఘాల అధ్యక్షులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కనకాద్రిపురం గ్రామ సంఘం అధ్యక్షురాలు తోట కృపామణిని మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నుకోగా కార్యదర్శిగా కిచ్చప్పగూడెంకు చెందిన సున్నం గంగాదేవి, కోశాధికారిగా పొంగుటూరుకు చెందిన సిర్రా కనకరత్నంను ఎన్నుకున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి, మహిళల ఆర్థిక బలోపేతానికి కమిటీ తరపున కృషి చేస్తామని నూతన కమిటీతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పూర్వపు అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- కొమ్ముగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం
- గడపగడపకు 150వ రోజు చేరుకున్న సందర్భంగా కె.కోటలో ర్యాలీ


కామవరపుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం 150వ రోజు కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి చెక్‌పోస్ట్ సెంటర్ మీదుగా చౌతాన సెంటర్ వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొమ్ముగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న అభివృద్ధి పనులపై ఆయన గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీ పేరుతో అర్హులైన వారికి ప్రభుత్వం అందించే పథకాలు అందక, రాష్ట్రం అభివృద్ధికి నోచుకోక ప్రజలు అల్లాడిపోయారన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని, మాయ మాటలతో ప్రజలను మోసం చేశారన్నారు. 4 ఏళ్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకోవచ్చి వలంటీర్‌ల ద్వారా ప్రతి గడపగడపకు పథకాలు ఇవ్వటం చేత సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలు జగన్ వైపే చూస్తున్నారని, టీడీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్ష హోదాకు కూడా నోచుకోదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి మరలా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, బొల్లు వెంకట సత్యనారాయణ, కోటగిరి కిషోర్ బాబు, నల్లూరి ప్రభాకర్‌రావు, మేడంకి చిన్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన అతిరాస కార్పొరేషన్ చైర్మన్


సీఎం జగన్‌ను కలిసిన అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కర్‌రావు

కొయ్యలగూడెం : పోలవరం ప్రాజెక్టు సందర్శనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్లు అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు తెలిపారు. అతిరాస కులస్తులకు ఇప్పటివరకు జగనన్న ఇళ్ల మంజూరు కానీ వారి లిస్టును అందజేశామన్నారు. అర్హులైనా అతిరాస కులస్తులకు ఇళ్లు మంజూరు కాకపోవడంతో సమస్య ఏర్పడిందని, సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించిన వివరాలను సమగ్రంగా అందజేయాల్సిందిగా సూచించారన్నారు. అతిరాస కార్పొరేషన్ ద్వారా ఇప్పటివరకు ఆయా వర్గాల వారికి అందిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారన్నారు.

369 మందికి వైద్య సేవలు


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం రూరల్ : పంగిడిగూడెంలో బుధవారం అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలు విభాగాలను సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ పి.సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు షణ్ముఖరెడ్డి, రవిచంద్రారెడ్డి, మురళీకృష్ణ ప్రారంభించారు. విజయవాడ, ఏలూరు, జంగారెడ్డిగూడెం నగరాలకు చెందిన ఆస్పత్రుల వైద్యులు ఆర్థోపెడిక్, కార్డియాలజీ, గైనకాలజీలతో పాటు జనరల్ వ్యాధులకు సంబంధించి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 369 మందికి వైద్య సేవలు అందించారు. 36 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఆర్‌ఎంపీ వైద్యులు మాంద్రు చంద్రరావు, అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కురెళ్ల రాంబాబు, రామిశెట్టి కిషోర్, భాను, నెమలగిరి చిరంజీవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏడు గ్రామాలను 41.15 కాంటూర్‌లోకి తీసుకోవాలని వినతి


సీఎం వైఎస్ జగన్‌కు సమస్యలు విన్నవిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

వేలేరుపాడు : ప్రతి ఏటా వచ్చే వరదలకు ముంపునకు గురయ్యే అన్ని గ్రామాలను 41.15 కాంటూర్‌లో తీసుకోవాలని వేలేరుపాడు మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. పోలవరం ప్రాజెక్ట్ పరిశీలనకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రిని మంగళవారం వారు కలిశారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేలేరుపాడు మండలంలో ఏడు గ్రామాలను 41.15 కాంటూర్ పరిధిలోకి తీసుకోవాలని కోరగా, ముఖ్యమంత్రి దీనిపై సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ లక్ష్మీ దేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాస గౌడ్, కామినేని వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

11న పౌరాణిక త్రిరత్నాల ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పౌరాణిక నాటకాలను ప్రోత్సహించడంలో భాగంగా హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11న పౌరాణిక త్రిరత్నాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఆ సంఘ యాజమాన్య కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో కానాల గురుమూర్తి కళావేదికపై ఈ ప్రదర్శనలు ఏర్పాటుచేశామన్నారు. పౌరాణిక నాటకాల్లో త్రిరత్నాలుగా పిలవబడే శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని మయసభ సీను, సెంటర్ సీను, సత్య హరిశ్చంద్ర నాటకంలోని వారణాసి సీనులను నగరానికి చెందిన జైదేవి కనక దుర్గ నాట్య మండలి కళాకారులు ప్రదర్శిస్తారన్నారు.

యోగ, ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ


కొయ్యలగూడెం : గ్రంథాలయంలో విద్యార్థులకు యోగ శిక్షణ ఇస్తున్న దృశ్యం


ద్వారకాతిరుమల : విద్యార్థులతో సంభాషణ నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారిణి బంగారు పాప

కొయ్యలగూడెం : వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు యోగ, ధ్యాన శిక్షణా తరగతులు నిర్వహించారు. యోగ, ధ్యాన శిక్షణా తరగతుల వలన విద్యార్థులలో సృజనాత్మకత శక్తి పెరగడంతోపాటు ఆరోగ్యపరంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. యోగ, ధ్యానం భారతదేశంలో పుట్టినవేనని భారతీయులమైన మనకు ఇది గర్వకారణం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నేడు యోగా, ధ్యాన శిక్షణపై విదేశీయులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారని లైబ్రేరియన్ రాముడు అన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతే దేశానికి వెన్నెముక అనే అంశంపై గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప విద్యార్థులతో బుధవారం సంభాషణ నిర్వహించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలు కన్నీళ్లు పెట్టకుండా, సంతోషంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించినప్పుడే అధిక దిగుబడులు వచ్చి, నిల్వలు పెరిగి ఆహార సంక్షోభం రాకుండా, ఆకలి మరణాలు సంభవించకుండా ఉంటాయన్నారు. విద్యార్థులు అన్నం పడవేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంగారావుపేట గ్రామస్తులు

టి.నరసాపురం : శ్మశాన వాటికను కబ్జా చేయాలని భూస్వాములు కుట్రలు చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరుతూ సంగారావుపేట గ్రామస్తులు బుధవారం టి.నరసాపురం తహసీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. తమకు కనీస నివాస స్థలాలు లేవని, కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఒకొక్క ఇంటిలో రెండు మూడు కుటుంబాలు నివసిస్తూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాగా మృతిచెందిన వారి కర్మకాండలకు కనీసం శ్మశానవాటిక లేదని, గ్రామ సరిహద్దులో బండివారిగూడెం రెవెన్యూలోని పాలకుంట చెరువు ఒడ్డున తమ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నామన్నారు. కాగా సదరు భూమిపై కన్నేసిన భూస్వాములు ఆ భూమిని కబ్జా చేయడానికి కుట్రలు చేస్తున్నారని, ఇప్పటికే చాలా భూమిని ఆక్రమించారన్నారు. కావున తమ వినతిని మన్నించి చెరువు విస్తీర్ణంపై సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, టి.సోమరాజు, పి.గోపాలరావు, బి.వీర్రాజు, బి.నాగమణి, పిసాదమణి, డి.జ్యోతి, ఎం.మంగ, కె.జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో అభివృద్ధి పథంలో దేశం


సమావేశంలో మాట్లాడుతున్న కొప్పాక శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం : ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో భారతదేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ కొప్పాక శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో బుధవారం పట్టణ ధార్మిక సెల్ అధ్యక్షుడు తుమ్మలపల్లి బ్రహ్మాజీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మరో ఐదేళ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటే దేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా దేశాన్ని ప్రధాని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కాశ్మీర్ సమస్య, అయోధ్య రామ మందిరం, పరిష్కరించారని తెలియజేశారు. పట్టణ ధార్మిక సెల్ అధ్యక్షుడు తుమ్మలపల్లి బ్రహ్మాజీ మాట్లాడుతూ దేశంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో శరవేరంగా నేషనల్ హైవేస్ గత ప్రభుత్వాల కంటే చాలా అద్భుతంగా నిర్మించారని, ఎస్సీ ఎస్టీ వర్గాలకు స్టాండప్ ఇండియా, మేకింగ్ ఇండియా ద్వారా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఫిర్ ఏక్ బార్ మోదీ అనే నినాదంతో ప్రజల ముందుకు వెళతామని, మూడోసారి దిగ్విజయంగా విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాయి సింగ్, చలమాల శ్రీను పాల్గొన్నారు.

మండుటెండల్లో చల్లని నేస్తాలు



ఏపీఆర్‌జేసీ సమీపంలో చెట్ల నీడ

బుట్టాయగూడెం : మండలంలో పలు రహదారులకు ఇరువైపులా పచ్చని చెట్లు ప్రకృతి అందాలకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు వేసవిలో సైతం ప్రయాణికులకు చల్లని నీడనిస్తున్నాయి. ఈ చెట్లు, పూలు రోడ్డు వెంబడి వెళ్తున్న వారికి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. నిద్రమామిడి, తురాయి, చింతచెట్లు, గానుగ, తదితర చెట్లు మార్గం వెంబడి ఉండడం వల్ల ప్రయాణికులు వేసవి ఎండల్లో సేదతీరుతున్నారు.


మర్లగూడెం సమీపంలో పాటెమ్మగుడి వద్ద చల్లదనాన్ని ఇస్తున్న చెట్లు


బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గంలో ఇలా...

రాష్ట్ర కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలి


ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కుకునూరు : కుక్కునూరు మండలం రెడ్డిగూడెం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కుక్కునూరు డివిజన్ ప్రెసిడెంట్ కురమ్ సంజీవరావు మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బోయ, వాల్మీకి, బెంతు, ఒరియా, కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. 1/70 విరుద్ధంగా కట్టిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని, అటవీ హక్కు చట్టం 2005 ప్రకారం సాగుచేస్తున్న ఆదివాసీలకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని, మండలంలో పీసా కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల నాయకులు ఎస్.ప్రసాద్, చిన్నబాబు, బోరెయ్య, రాము నాగరాజు, రాధ తదితరులు పాల్గొన్నారు.

